అధ్వానంగా రహదారులు
● ఇక్కట్లు పడుతున్న ప్రజలు
7

మూడు సొసైటీల ముచ్చట తీరేనా..?
8



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

జోరందుకోనున్న సాగు

● ఖరారైన ఎస్సారెస్పీ నీటి విడుదల షెడ్యూల్ ● అన్నదాతలకు గుడ్ న్యూస్ చెప్పిన శివం కమిటీ ● వారబందీ పద్ధతిలో సరఫరా

జగిత్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం పంట సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి షెడ్యూల్ ఖరారు అయింది. ఎస్సారెస్పీ నీరు విడుదల ఎప్పుడెప్పుడా..? అని ఎదురు చూస్తున్న రైతాంగానికి శివం కమిటీ సమావేశం గుడ్ న్యూస్ చెప్పింది. ఈనెల 3వ తేదీన హైద్రాబాద్‌లోని జలసౌదలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 7వ తేదీ నుంచి పంట చేతికొచ్చే వరకు ఒక వారం విడుదల చేస్తూ మరో వారం నిలుపుదల చేస్తూ నీరు సరాఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ప్రస్తుత సీజన్‌లో వానాకాలం పంటల సాగు మరింత జోరందుకోనుంది.

వారబందీ పద్ధతిలో...

ఎస్సారెస్పీ నుంచి వారబందీ పద్ధతిలో నీటిని సాగు కాలువలకు విడుదల చేయనున్నారు. ఎస్సారెస్పీ జోన్-1 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 1 నుంచి 53వ డిస్ట్రిబ్యూటరీ వరకు మొదటి ఏడు రోజులు నీటిని విడుదల చేస్తారు. ఎస్సారెస్పీ జోన్-2 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 54 నుంచి 94 డిస్ట్రిబ్యూటరీ వరకు తదుపరి ఏడు రోజులు నీటిని విడుదల చేయనున్నారు. ఇలా వారబందీ పద్ధతిలో వానాకాలం పంట సాగు ముగిసే వరకు అవసరమైన నీటిని అన్నదాతలకు అందించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

ఆయకట్టు రైతుల ఆశలు సజీవం..

ఎస్సారెస్పీ ఆయకట్టు రైతుల ఆశలు సజీవంగా నిలిచే అవకాశాలు కని పిస్తున్నాయి. ప్రాజెక్టును 1983లో జాతికి అంకితం చేశారు. అప్పటి నుం చి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. మాన్యువల్ ఆధారంగా ప్రాజెక్టు గేట్లను నిర్మాణం చేశారు. ప్రాజెక్టుకు వరదలు వచ్చే సమయంలో పెద్ద మొత్తంలో వరద వచ్చి చేరుతోంది. ఆ సమయంలో ప్రాజెక్టులోని మొత్తం 42 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఇటీవల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను కొన్ని రోజుల క్రితం ఎత్తారు. దీంతో గోదావరి ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తోంది. దీనికి తోడు మహారాష్ట్రలోని విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులో నిండుగా ఉండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు.

దీంతో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో నిల్వ ఉన్న నీటికి తోడు మరో ఒకటి, రెండు టీఎంసీల నీరు వచ్చి చేరితే ఆయకట్టు వానాకాలం పంటలకు డోఖా లేకుండా పో తోందని రైతులు ఆశతో ఉన్నారు. 45 టీఎంసీల నీరు ఉంటే తాగునీటి అవసరాలు, ఆవిరి రూపంలో పోయే నీటి లెక్కలు కలుపుకొని వానాకా లంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు సరఫరా చేపడుతారని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

7న కాకతీయ కాలువకు విడుదల...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని ఈనెల 7వ తేదీన కాకతీయ కాలువకు విడుదల చేయనున్నారు. అదే విధంగా లక్ష్మీ కాలువ, సరస్వతీ కాలువలు, ఎత్తి పోతల పథకాలకు సైతం నీటిని విడుదల చేయనున్నారు. గతేడాది సైతం ఆగస్టు మొదటి వారంలో శ్రీరాంసాగర్ నీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేశారు.

ప్రస్తుత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి నీరు చేరుతుండడంతో సాగు కోసం దిగువకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. అధికారులు ఇచ్చిన నివేదికకు అనుగుణంగా హైద్రాబాద్‌లోని జలసౌదలో రాష్ట్ర స్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ ఛైర్మన్ ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు.

వర ప్రదాయిని శ్రీరాంసాగర్..

జిల్లాలో రెండు, మూడు మినహా దాదాపుగా అన్ని మండలాల్లో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ఆయకట్టు పరిధిలో ఉంది. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా సాగు నీరు అందుతోంది. జిల్లా రైతాంగానికి ఎస్సారెస్పీ వరప్రదాయినిగా ఉంది. ప్రాజెక్టు కింద జిల్లాలో సు మారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 1.60 లక్షలు, ఆదిలాబాద్‌లో 1.45 లక్షలు, కరీంనగర్ 6.72 లక్షలు, వరంగల్ 4.71 లక్షలు, ఖమ్మం 1.28 లక్షలు, నల్లగొండ 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదిలా ఉండగా జగిత్యాల జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో వరి దాదాపు 3.5 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

ప్రాజెక్టులో ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 44.266 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 76.499 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల ద్వారా 18,291 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 723 క్యూసెక్కుల నీరును వదులుతున్నారు. ఇందులో ఆవిరి ద్వారా 482 క్యూసెక్కులు నీరు వ్యయం అవుతోంది. మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కులను వదులుతుండగా ఇందులో కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్‌లకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డిలకు 107 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాలకు వదులుతున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే...

టి. శ్రీనివాస్ రావు, ఎస్ఈ, పోచంపాడ్ ప్రాజెక్టు



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి రైతులకు అవసరమైన నీటిని విడుదల చేయడానికి నిర్ణయించాము. హైద్రాబాద్‌లో జరిగిన శివమ్ కమిటీ సమావేశంలో సాగు నీటి విడుదల ప్రణాళికను ఖరారు చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి ఎస్సారెస్పీ నీటిని కాలువల ద్వారా వారబందీ పద్ధతిలో విడుదల చేయనున్నాము.

సాగు పనులు ఊపందుకుంటున్నాయి

వాణి, జిల్లా వ్యవసాయ అధికారి



జిల్లాలో ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో సుమారు 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని అంచనా వేశాము. ఇటీవల కురిసిన ముసురు వర్షాలు కారణంగా భూగర్భ జలాలు పెరిగాయి. దీనికి తోడు చెరువులు, కుంటలు సైతం జల కళను సంతరించుకుంటున్నాయి. దీంతో వానాకాలం సాగు పనులు ఊపందుకుంటున్నాయి. ఎస్సారెస్పీ జలాల విడుదలపై రైతులు ఆశతో ఉన్నారు.

డీఈవోపై ప్రభుత్వ విప్ అడ్లూరికి ఫిర్యాదు



అడ్లూరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్‌టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ధర్మపురి, ఆగస్టు 4: పదిహేను ఏళ్లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డిని తొలగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మచ్చ శంకర్, ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్ కోరారు. ఈ మేరకు ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం వారిద్దరు కలిసి ఫిర్యాదు చేశారు. డీఈవో నిరంకుశ వైఖరి వల్ల జిల్లాలోని ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వెంటనే ఆయనను మాతృ సంస్థ డైట్ కరీంనగర్‌కు బదిలీ చేయాలని సిఫారస్ చేయాలని వారు కోరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో స్పౌజ్ కేటగిరిలో కొంత మంది ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి పలు అక్రమాలకు పాల్పడ్డారని వారిపై నేటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఫిర్యాదు చేశారు. పదోన్నతుల్లో డీఎస్సీ 96 చెందిన కొంత మంది ఎస్‌జీటీ ఉపాధ్యా యులను కాదని కేవలం ఇద్దరికి మాత్రమే పదోన్నతులు కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు సర్వీస్ పర్సన్‌ల నియామకం, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుచూ అడ్లూరికి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు.

జీవో నం 67ను పునరుద్ధరించాలి

ఎమ్మెల్సీకి ఎస్టీయూ నాయకుల విజ్ఞప్తి



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 4: ఉపాధ్యాయులకు నెల నెల పదోన్నతులు కల్పిస్తూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో నెం 67ను వెంటనే పునరుద్ధరించేలా చొరవ చూపాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం 2016లో ఈ జీవోను నిలిపివేసిందని గుర్తుచేశారు. సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి వెంటనే ఉపాధ్యాయులకు ఎంఈ పోలుగా, జూనియర్ లెక్చరర్‌లుగా పదోన్నతులు కల్పించి ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 4డీ ఏలతో పాటు పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఎంతో కాలంగా ఎదరిచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సజావుగా పూర్తి చేసి నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ బాధ్యులు పాల్గొన్నారు.

రైతు కుటుంబంలో వికసించిన విద్యా కుసుమం

నీట్‌లో రాష్ట్ర స్థాయిలో కోరుట్ల విద్యార్థిని ప్రతిభ



తేజస్వివి(ఫైల్)

కోరుట్ల, ఆగస్టు 4 : రైతు కుటుంబంలో విద్యా కుసుమం వికసించింది. నీట్‌లో 573 మార్కులు సాధించి ఎంబీబీఎస్ విద్యకు అర్హత పొందడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మేడిపల్లి మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల లింగయ్య-పావని దంపతులు పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారికి నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె గాండ్ల తేజస్విని ఇటీవల నిర్వహించిన నీట్‌లో 573 మార్కులు సాధించి రాష్ట్రంలో 1629 ర్యాంకు పొంది ఎంబీబీఎస్ విద్య అభ్యసించడానికి అర్హత పొందింది. తేజస్వినిని రాంనగర్ కాలనీ వాసులతో పాటు మాసాపూర్ గ్రామానికి చెందిన వారు సన్మానించి అభినందించారు. తేజస్విని మాట్లాడుతు ఎంబీబీఎస్ తరువాత బీజీవో కోర్సును పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాల వారికి వైద్య సేవలు అందిస్తానని తెలిపింది.

శ్రమదానంతో రోడ్డుపై గుంతలు పూడ్చివేత

కొడిమ్యాల, ఆగస్టు 4 : మండలంలోని కోనాపూర్ గ్రామస్థులు ప్రధాన రోడ్డు నుంచి గ్రామం వరకు ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయం కావటంతో ఆదివారం గ్రామస్థులు స్వంత ఖర్చులతో శ్రమదానం చేసి రోడ్డుపై గుంతలను పూడ్చారు. సుమారు నెల రోజులుగా గ్రామస్థులు బురద రోడ్డుపై రాకపోకలకు నానా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అధికారులకు సమాచారం అందించిన ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రవీందర్‌రెడ్డి, సతీష్, మధు, మల్లేశం, శేఖర్, రమేష్, తిరుపతి, సునీల్, ఆంజనేయులుగౌడ్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని నూకపల్లి శివారులో గల వరదకాలువ వంతెన వద్ద ఏర్పడిన ప్రమాదకర గుంతలను స్థానిక యువకులు ఆదివారం పూడ్చివేశారు. కరీంనగర్-జగిత్యాల మార్గంలో వెలుతున్న వందలాది వాహనాలు ఈ గోతులతో ఇబ్బందులు పడడం, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మిస్త్రీ శ్రీనివాస్, మారంపల్లి శషి, రాజు, గంగన్న తమ సొంత ఖర్చులతో సిమెంట్ తదితరవి సమకూర్చి పూడ్చివేశారు. యువకులను పలువురు అభినందించారు

కార్యవర్గం ఏర్పాటు

మెట్‌పల్లి, ఆగస్టు 4 (ఇబ్రహీంపట్నం): సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులుగా డబ్బ గ్రామానికి చెందిన నేరెళ్ల సుభాష్ గౌడ్‌ను నియమించినట్లు కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు ఏపూరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్‌తో కలిసి నియామక పత్రం అందజేశారు. రెండవసారి అధ్యక్ష పదవి అప్పగించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని సుభాష్ ధన్యవాదాలు తెలిపారు. నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మిత్రుడు కుటుంబానికి నగదు అందజేత

మల్లాపూర్, ఆగస్టు 4 : మండలంలోని పాతదాం రాజుపల్లి గ్రామానికి చెందిన మిత్రుడు మృతి చెందగా వృద్ధ తల్లిదండ్రులకు నగదును తోటి స్నేహితులు అందజేసారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలో 2006-07వ పదవ తరగతి బ్యాచ్‌లోని మిత్రుడైన మారంపల్లి శ్రీనివాస్ దశాబ్ధి కాలం క్రితం మృతి చెందాడు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా తోటి మిత్రులు ఆయన ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు 30వేల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. నగదు అందజేసిన వారిలో రాజేందర్, హరీష్, స్వామి, జగదీష్, రాజు ఉన్నారు.

దేశ చరిత్రలో రైతు రుణమాఫీ సువర్ణాధ్యాయం

● ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన సాగుతుంది
● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: రైతులను అప్పుల బాధనుంచి విముక్తికోసం ఏక కాలంలో 31వేల కోట్లతో ఒక్కో రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే ఓ సువర్ణాధ్యాయం అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో రూరల్ మండలానికి చెందిన 247 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 58లక్షల రూపాయల విలువగల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కొసమే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని విమర్శలు చేసిన పట్టించుకోనని, తన జీవితం తెరిచిన పుస్తకమన్నారు. కాంగ్రెస్ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుచేస్తామని, వాటికి అవసరమైన రెట్టింపు నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఇండ్లులేని నిరుపేదలకు సైతం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం ద్వారా ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాజెక్టులకు పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలోనే సీఎం సహాయనిధి చెక్కులను అధికంగా జగిత్యాలలోనే పంపిణీ చేశామన్నారు. నాయకులు, అధికారులు లబ్దిదారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఎల్లవేళలా అండగా ఉంటా

తనకు వెన్నంటు ఉన్న జర్నలిస్టులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేస్తున్న నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిల సహకారంతో జర్నలిస్టులకు విడతల వారీగా ఇండ్ల స్థలాలు మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలోని గోవిందుపల్లెకు చెందిన విరుగొండ రాజశేఖర్ రెడ్డి హార్ట్‌స్ట్రోక్‌తో మరణించగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

కొనసాగుతున్న ఎస్సీ వర్గీకరణ సంబరాలు

సీఎం, మందకృష్ణ, అడ్లూరి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు..



ధర్మపురిలో మాదిగ, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం

ధర్మపురి, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ధర్మపురి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు పారుపెల్లి రాజమల్లయ్య, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, శ్రీరాం మహేందర్, బొల్లారపు పోచయ్య, కొమ్ము లక్ష్మీనారాయణ, అంజయ్య, నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టులో తీర్పు రావడం సంతోషం : విప్ అడ్లూరి

ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో తీర్పు రావడం చాలా సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి ఆదివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా చేసిన పోరాటం అనంతరం జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో తీర్పు వచ్చిందన్నారు. త్వరలో దళిత వర్గాల తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కొద్ది రోజుల తరువాత మండలానికి స్వయంగా నేనే వస్తానని, ప్రతి ఒక్కరి సమస్యలు నేరుగా విని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. మరొక సారి ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి, మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంతో పట్టణంలో మోచి సంఘం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం పట్టణంలోని మోచి సంఘం భవనంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి, ఎస్సీ వర్గీకరణ పోరాట సారధి మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మోచి సంఘం నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాదిగ ఉపకులల అభ్యున్నతి కోసం రాబోయే తరాలు భవిష్యత్తులో విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని మందకృష్ణ మాదిగ కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొండ్లెపు దశరథం, పెంటయ్య, సాయిలు, రాములు, మచ్చేందర్ పాల్గొన్నారు.



మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంఘమిత్ర యూత్ అధ్యక్షుడిగా శివారెడ్డి



రాయికల్, ఆగస్టు 4: రాయికల్ పట్టణ సంఘమిత్ర (శివాజీ) యూత్ అధ్యక్షుడిగా పటేల్ శివారెడ్డి ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా జిల్లాల సూర్యం రెడ్డి, కోశాధికారిగా పాలడుగు విజయ కేతన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కన్నెవేణి వేణుగోపాల్ రెడ్డి, పాతూరి శివరామకృష్ణా రెడ్డి, బొడుగం తిరుపతిరెడ్డి, ఎద్దండి శివారెడ్డి, జిల్లాల సతీష్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

రాయికల్, ఆగస్టు 4: రాయికల్ పట్టణంతో పాటు మండలంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాయికల్ పట్టణంలోని కేవవనగర్‌లో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. యువజనసంఘ అధ్యక్షుడు ఎలిగేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొమ్మకంటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి గంట్యాల ప్రవీణ్, సంఘ సభ్యులు రాజశేఖర్, రంజిత్, రమేష్ శ్రీనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

పెగడపల్లి : మండలంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సృష్టిలో అన్నింటికంటే బలమైన బంధం స్నేహబంధం అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలపుకుని స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు తమ తమ స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బాండ్ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని పలు వార్డులలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

యువతి, యువకులు, పిల్లాలు, పెద్దలు తమ స్నేహితులను కలుసుకోని సంబరాలు జరుపుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మద్దెనపల్లి లక్ష్మణ్ అంబేద్కర్ చిత్ర పటం గీసి స్నేహితుల దినొత్సవ శుభాకంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ను పలువురు అభినందించారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి








రాణాకు చేరిన చిట్టీల పంచాయితీ

మల్లాపూర్, ఆగస్టు 4: మండలంలో జోరుగా జరుగుతు న్న జీరో చిట్టీల దందా చిలికిచిలికి గాలి వానగా మారి పోలీసుస్టేషన్‌కు చేరింది. మండలం లోని మొగిలిపేటలో జరుగుతున్న చిట్టీలతో మోసపోయామని నిర్వహకుడు ఆకుల గంగాధర్‌పై బాధితుడు సంగం పెద్దగంగారాం పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్ రూ. 5లక్షలు, రూ. 6లక్షలు, ఐదు తులాల బంగారం చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. దీంతో చిట్టీలు కట్టమని సంప్రదించగా రూ. 5, రూ. 6 లక్షల చిట్టీలు కట్టడంతో పాటు కుతూరు ముక్కెర లక్ష్మీతో ఐదు తులాల బంగారం చిట్టీలను నాలుగు సంవత్సరాల నుంచి కట్టుకుంటు వస్తున్నామన్నాడు. కట్టిన చిట్టి డబ్బులు ఇవ్వమని ఆకుల గంగాధార్‌ను గతనెల నుంచి అడుగుతు న్నా పట్టించుకోకుండా దాటవేశాడు. దీంతో గ్రామంలోని పెద్దమనిషి వద్దకు పిలిచి అడగా మీరే డబ్బులు నాకు ఇంకా ఇవ్వాల్సి ఉందని బెదరింపులకు పాల్పడ్డాడు. కట్టిన చిట్టిన డబ్బులు ఇవ్వక బెదరింపులకు పాల్పడుతున్న ఆకుల గంగాదర్‌పై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.





కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు


ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్ద రాగట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మందాటి మల్లేశంపై ఆదివారం కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన మల్లేశంను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లేశం రహదారి వెంట వస్తున్న క్రమంలో గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా మీద పడి దాడికి దిగాయి. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు- ద్విచక్రవాహనం ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

మంథని ఆగస్టు 4: ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటన ఆదివారం మంథని మున్సిపాల్ పరిధీలోని గంగపురి వద్ద చోటు చేసుకుంది. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్08జెడ్0086) మంథని నుంచి హైదరాబాదుకు వెళ్లే క్రమంలో గంగపురి మూలమలుపు వద్ద ప్రమాదం సంభవించింది. ముత్తారం నుంచి మంథనికి వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఆర్టీసీ బస్సుకు తగలడంతో ద్విచక్ర వాహనం కింద పడింది. ద్విచక్రవాహ నం వెనుకాల కూర్చున్న వ్యక్తి దండు పోచయ్యకు ప్రమాదంలో కాలు విరిగింది. గాయపడిన వ్యక్తిని మంథని ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.





తాగడానికి డబ్బులు లేక మద్యం షాపుల్లో చోరీలు

- నిందితుడిని పట్టుకున్న సుల్తానాబాద్ పోలీసులు

సుల్తానాబాద్, ఆగస్టు 4: మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి మద్యం కొనుగోలుకు డబ్బులు లేక తురుచుగా మద్యం దుకాణాల్లోనే దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తాము సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సిద్దిపేట మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన మడిగుడ్ల విజయ్‌కుమార్ (40)అనే వ్యక్తి ˇ పట్టుబడ్డారని తెలిపారు. ఇతన్ని విచారించగా దొంగతనాలను వృత్తిగా చేసుకు ని విందులు వినోదాలు జల్సాలు చేసుకుంటున్న వ్యక్తిగా నిర్ధారణ చేశామన్నారు. నాలుగు రోజుల క్రితం సుల్తానాబాద్ పట్టణంలోని పల్లవి బార్‌లో కూడా దొంగతనం చేశాడని, బార్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. విజయ్ కుమార్ మొదటి సారిగా సుల్తానాబాద్ ప్రాంతానికి వచ్చి రాజీవ్ రహదారి సమీపంలోని ఈ బార్‌ను ఎంచుకుని అతిగా మద్యం సేవించి బార్ గోడ దూకి దొంగతనానికి పాల్పడ్డాడని వివరించారు.

● **వివిధ జిల్లాల్లో ముప్పై కేసులు..**

మద్యానికి బానిసగా మారిన విజయ్‌కుమార్ మద్యం కోసం, జల్సాల కోసం చోరీలకు పాల్పడే వాడని ఇలా రంగారెడ్డి, సిద్దిపేట, జీడిమెట్ల, కొత్తగూడెం, రాయదుర్గం, వనస్థలిపురం, మహబూబాబాద్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాలో ముప్పై కేసులు నమోదై ఉన్నాయని ఎస్ఐ శ్రావణ్ కుమార్ వివరించారు. నిందితుడిని అదివారం సుల్తానాబాద్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు తెలిపారు.









అధ్వానంగా రహదారులు

● వర్షాలకు మరింత ప్రమాదకరంగా రోడ్లు
● ఇక్కట్లు పడుతున్న ప్రజలు
● పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు


అధ్వానంగా రాంపూర్- రామన్నపేట మార్గం


ముత్యంపేట వరదకాలువ బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు


గుంతలతో ముత్యంపేట నుంచి బ్లాక్ చౌరస్తాకు వెళ్లే మార్గం

మల్యాల, ఆగస్టు 4: మండల వ్యాప్తంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మతులు లేకపోవడం, కొత్తగా పనులు చేపట్టకపోవడంతో ప్రయాణానికి ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఈ రహదారులపై తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. లోతైన గుంతలు, దారి అంతా కాలువలను తలపించేలా నీటి నిలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో రహదారులు కోతలకు గురి కాగ కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. తారు లేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. రామన్నపేట- రాంపూర్- జగిత్యాల వెళ్లె రహదారికిరువైపుల కోతలకు గురి అయి లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం గుంతలమయమై బురద రోడ్డుగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే గొర్రెగుండం వెళ్లె మార్గంలో తారు లేచి, గోతులు ఏర్పడ్డాయి. ఇదే మార్గం నుంచి మండంలోని ఓగులాపూర్‌తో పాటు కొడిమ్యాల మండలానికి నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. రహదారి అధ్వన్నంగా మారడంతో ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తుంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారులు దెబ్బతినడంతో ప్రజలు, ప్రయాణీకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

● **కాలువలను తలపిస్తున్న రహదారులు**

మండలంలోని వరదకాలువ ప్రాంత గ్రామాల పరిధిలో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. వరదకాలువతో ఒర్రెలు ఉనికి కోల్పోగా వాటి ద్వారా వచ్చే నీరు రహదారులపై ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వరదకాలువ వంతెనలపై మరమ్మత్తులు లేకపోవడంతో బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉంది. తగు చర్యలను తీసుకోవాలని వరదకాలువ ప్రాంత ప్రజలు, ప్రయాణీకులు అధికారులను కోరుతున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 4: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరు జలశయానికి ఎత్తిపోతలు కొనసాగుతున్నా యి. ఆదివారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరు డ్యాంలోకి తరలి వె ళుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 15.507 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● **ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 18,291 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 44.266 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాజన్న ఆలయంలో నేటినుంచి బ్రేక్ దర్శనం

వేములవాడ రూరల్, అగస్టు 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి బ్రేక్ దర్శనం అమలు చేయనున్నట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10-15 ని॥ల నుంచి 11-15 ని॥ల వరకు, సాయంత్రం 4-00 నుంచి 5-00 వరకు భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం ఉంటుందన్నారు. బ్రేక్ దర్శనం టికెట్ 300 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు కుంటల విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని విత్తనాలకు సంబంధించిన చేప పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. అయితే చేపపిల్లల పంపిణీకి గత నెలలో టెండర్‌లు పిలవగా, సంబంధిత చేపపిల్లల కాంట్రాక్టర్‌లు కుమ్మక్కయ్యారని ఎవరూ టెండర్‌లో పాల్గొనకుండా చేయడం వల్ల కార్యక్రమం వాయిదా పడిందన్నారు. కావున చేపపిల్లల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాక తరుపున ప్రత్యక్షంగా చేపపిల్లల పంపిణీకి బదులు వాటి విలువకు అనుగుణంగా చెరువు విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని మత్స్యపారిశ్రామిక సంఘాలకు నేరుగా నగదు రూపకంగా గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ చర్యల వల్ల దళారీవ్యవస్థ జోక్యం నిలువరింపజేయవచ్చన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాసిన లేఖపై జిల్లా గంగపుత్ర సంఘ పక్షాన గుమ్ముల అంజయ్య జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



వేములవాడ, సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

వేములవాడ రూరల్, ఆగస్టు 4: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం పోరాటం చేస్తామని, గ్రామస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో టీకేఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నికల వేళ డబ్బు ప్రభావం పెరిగినా ప్రజలు ఇప్పటికీ ఎర్ర జెండా వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రజల సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు ముందుంటాయన్నారు. ప్రజల పక్షాన పోరాడడానికి పార్టీ చట్ట సభల్లో బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. మతంపేరుతో పబ్బం గడుపుకునే పార్టీలకు త్వరలోనే కాలం చెల్లుతుందన్నారు. పార్లమెంట్‌లో సీట్లు తగ్గినప్పటికీ బీజేపీ నాయకులకు అహం తగ్గడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకువస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఎండగడుతామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు టి వెంకటరాములు, టీకెఎంయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. కాంతయ్య, ఎన్ బాలమల్లేశ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కయ్యడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, ఏసు, నాయకులు లింగారెడ్డి, మహాలక్ష్మి, కడారి రాములు పాల్గొన్నారు.

● **వస్త్ర పరిశ్రమలను కాపాడాలి..**

సిరిసిల్ల రూరల్: రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్మలు, అక్కలంటూ తిట్టుకునే దుస్థితి వచ్చిందని, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ఒకరిని ఒకరు తిట్టుకోవడంపై అధికార, ప్రతిపక్షాలు దృష్టి పెట్లాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఉపాధి కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొనసాగించిన పథకాలను బంద్ చేసి కార్మికులకు ఉపాధిని దెబ్బతీయం ఎంతవరకు సమంజమన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తాను మాట్లాడానని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందన లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్డర్లకు సంబంధించిన బకాయిలను ఇవ్వలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అసాములసమన్వయ కమిటి అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, పోరండ్ల రమేష్, ఏనుగుల ఎల్లయ్య, అంకాలపు రవి, గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్, గోవిందు రాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఆగస్టు 4: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో విలేజ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం టీఎస్02యూడీ4400 ఆటో ట్రాలీలో 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అట్టి బియ్యం ఎక్కడి నుంచి తీసుకొని వెళ్తున్నారని, రవాణా చేయుటకు అనుమతి పత్రాలు ఉన్నాయానని ప్రశ్నించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో విచారించగా, తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందించే బియ్యాన్ని ఒక కిలోకి రూ. 12ల చొప్పున కొనుగోలు చేసి చింతకుంట, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లోని కోళ్ల పారాలకు రూ. 17లకు అమ్ముకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారన్నారు. ట్రాలీని, గంట వెంకటేష్, సిద్ధంకి భాస్కర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 4: శంకరపట్నం మండలం చింతలపల్లి శివారులో ఆటో బైక్ ఢీ కొని ఒకరు గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం కొండపలకల గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి గణపతిరెడ్డి చింతలపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా, చింతలపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో గణపతిరెడ్డి తలకు, కాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 4: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని శాలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాల మహానాడు సభను విజయవంతం చేయండి

కొడిమ్యాల, ఆగస్టు 4: డిల్లీలోని జంతర్‌మంత ర్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించే మాల మహానాడు సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మేడి అంజయ్య మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారానికి నిర్వహించే సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు హాలో మాల చలో డిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చెన్నల సుమన్, మండల అధ్యక్షుడు కాయితరాజు, కన్వీనర్ రావుల నర్సింగరావు, నాయకులు బండి చందు, రాకేష్, శేఖర్, అర్జున్, యుగందర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల సంఘం నాయకులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు


లంబ రాములు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని వ్యక్తి లంబ రాములు అదృశ్యంపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు ఆదివారం తెలిపారు. రాములు గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాడిగేదెకు గడ్డి వేసి వస్తానని ఈ నెల 3న ఇంటిలో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడని పేర్కొన్నారు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదని చెప్పారు. రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు వివరించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 4: బోయినపల్లి మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన కడుదుల కొమురయ్య(70) అనే వృద్ధుడు అనారోగ్యంతో ఇబ్బంది పడి ఇంటిముందు ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కేతమ్మ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కొడుకులు గతంలోనే చనిపోయారు. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకున్నట్లు కొమురయ్య భార్య కేతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కటకం సత్యం(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4: నగరంలోని పద్మనగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై కటకం సత్యం (48) అనే వర్కర్ మృతి చెందాడని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం శాలపల్లికి చెందిన కటకం సత్యం రోజులాగే ఆదివారం 12:30 గంటల ప్రాంతంలో స్కూల్ మైదానంలోని రన్నింగ్ ట్రాక్‌ను జెట్ ప్రెషర్ పంప్‌తో శుభ్రం చేస్తుండగా ప్రమా దవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న సూపర్‌వైజర్, కుక్‌లు గమనించి మోటార్ ప్లగ్ తొలగించారు. కిందపడిపోయిన సత్యంను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన


ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్16 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నెట్స్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 142 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి నిర్వహకులు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాలలో ప్రతిభను పరీక్షించి, ప్రతిభ చాటిన 18మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రికెట్ జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినున్న అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ పోటీల నిర్వహణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు పాల్గొని పర్యవేక్షించారు. జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు, ఈసీ అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు

- టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: పదేళ్లుగా ప్రమోషన్‌లు, బదిలీల కల సాకారం చేసి వందలాది కోర్టు కేసుల ద్వారా నమ్మకం కోల్పోయిన వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతుల కల సాకారం చేసిన ప్రభుత్వం, తమ సర్వీస్ రూల్స్‌ను సైతం తప్పక అమలు చేస్తుందనే విశ్వాసం తమకుందని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో టీఆర్టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తూ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. జీవో నంబర్ 11, 12ను సవరించి బీఈడీ పూర్తి చేసిన ఉపాధ్యా యులకు పీఎస్ హెచ్‌ఎంల పదోన్నతికి అర్హత కల్పించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. త్వరలోనే పీఎస్ హెచ్‌ఎంల పోస్టులు మంజూరు చేస్తూ వాటిలో ఎస్జీటీ ఉపాధ్యాయుల అందరికీ పదోన్నతి అవకాశం కల్పించబడుతుందని వివరించారు. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. జీవో నంబర్ 317 ఉత్తర్వుల మేరకు నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ స్థానిక జిల్లాలో బదిలీల కొరకు రాష్ట్ర సంఘ పక్షాన కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్, విజయానందరావు, చిన్నయ్య, సాయికృష్ణ, రణధీర్, అంబాజీ నాయక్, భీమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కటుకం రమేష్

రాళ్లవాగు ప్రాజెక్ట్‌కు జలకళ

● ఆయకట్టుదారుల్లో ఆనందం



మత్తడి దూకుతున్న రాళ్లవాగు

కథలాపూర్, ఆగస్టు 4 : వర్షాకాలం ఆరంభమై రెండు మాసాలు గడుస్తున్నా రాళ్లవాగు ప్రాజెక్ట్ ఎప్పుడు నిండుతుందోనని రైతాంగం ఎదురు చూస్తుండగా ప్రాజెక్ట్‌కు జలకళ సంతరించుకుంది. నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం కోనాపూర్ అడవుల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. పూర్తిగా నిండిపోవడంతో మత్తడి పొంగి పొర్లుతోంది. ఈ ప్రాజెక్ట్ నిండితే భూషణరావుపేట, కథలాపూర్, ఊట్‌పల్లి, కోనాపూర్ గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్య లేకుండా ఉంటుంది. ప్రాజెక్ట్ నిండడంతో ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సరిపడా ఎరువులు అందక రైతుల ఇక్కట్లు



ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులు(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 4 : సాగుకు సరిపడా ఎరువులు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామ శివారులోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో రైతు ఆధార్ కార్డుపై రెండు సంచులు అందజేస్తున్నారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా వేయాల్సిన రసాయన ఎరువులకు డిమాండ్ పెరిగింది. రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నా ఆధార్‌కార్డును బట్టి రెండు సంచులు మాత్రమే ఇవ్వడంతో పంటకు పూర్తిగా సరిపడా ఎరువులు అందడంలేదని అన్నదాతలు వాపోతున్నారు. సొసైటీకి ముందుగా వచ్చి ఆధార్‌కార్డు లైన్‌లో పెట్టిన మొదటి రెండు వందల మంది రైతులకు ఎరువులను అందజేస్తున్నారు. మిగతా వారు నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. దీంతో ఎక్కువ ధరకు బయట కొనుగోలు చేసుకుంటున్నామని వాపోయారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీని వివరణ కోరగా ఇప్పటి వరకు సొసైటికి 120టన్నుల ఎరువులు వచ్చాయని, రైతులకు సరిపడా ఎరువులు అందిస్తామన్నారు.

గ్రామైక్య సంఘం అధ్యక్షుడిగా రాజేశం

కొడిమ్యాల, ఆగస్టు 4 : కొడిమ్యాల పట్టణ గ్రామైక్య సంఘం అధ్యక్షుడిగా ఆది వారం అంకం రాజేశంను పలు కుల సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాంకాలి స్వామి, సంయుక్త కార్యదర్శిగా దీకొండ చంద్రశేఖర్, కోశాధికారిగా కాల్వ నరేష్, ఉపాధ్యక్షులుగా కొత్తూరి స్వామి, బండి మురళీ మోహన్, జమాలుపూరి శ్రీనివాస్, బల్ల పోచమల్లయ్య, గుర్రం రవి, ప్రధాన సలహాదారులుగా విలా సాగరం కుంటయ్య, పాలకుర్తి శ్రీనివాస్, సుల్తాన్, సలావుద్దీన్, పొన్నం లక్ష్మన్, గ్రామంలోని పలు కుల సంఘాల అధ్యక్షులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహకులుగా ఉపాధ్యాయులు నాంపెల్లి మల్లేశం, బొమ్మ సురేష్, సత్యా నందం, వొద్నాల రాజు, గ్రామ ప్రముఖులు జనార్దన్, లక్ష్మీరాజం, సీనియర్ జ ర్నలిస్ట్ కంచర్ల రాములు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలను తరాలకు నేర్పించాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 4 : ప్రస్తుతం సమాజంలో ఆచార వ్యవహారాలు తగ్గిపోయాయని, తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బ్రాహ్మణ సేవా సమితి వారు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని పురాతనమైన కొండ స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సమితి సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆషాడ మాసం అమావాస్య సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రాహ్మణ జన్మ మహోన్నతమైనది, తమ పిల్లలకు తల్లిదండ్రులు ఆచార వ్యవహారాలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న కిష్టంపేట నాయకులు

రాయికల్, ఆగస్టు 4: మండలంలోని కిష్టంపేట గ్రామంలో గ్రామైఖ్య సంఘాలు, 50 స్వయం సహాయక సంఘాల కసం భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ నాయకులు ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిశారు. అలాగే చల్‌గల్-కిష్టంపేట గ్రామానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొరపు శంకరయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి గౌడ్, జాన గోపి, జాన గంగాధర్, చిలుక శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు. మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ తల్లి పుల్లమ్మ అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రాయికల్, ఆగస్టు 4: మండలంలోని రామాజీపేట గ్రామంలో ఆదివారం జగిత్యాల పావని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి ఉచిత బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, పావని రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ ప్రభాకర్, జలంధర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మూడు సొసైటీల ముచ్చట తీరేనా..?

● భూషణరావుపేట సింగిల్ విండో విభజనపై ఆశలు

● విండో ఏకగ్రీవ తీర్మానం..

సర్కారు ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు

కథలాపూర్, ఆగస్టు 4 : రైతులకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 12 గ్రామాలతో విస్తరించి ఉన్న మండలంలోని భూషణరావుపేట సింగిల్ విండోను విభజించాలని నిర్ణయించారు. ఈ మేరకు పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ సహకార శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం నుంచి విభజనకు సంబంధించిన ఉత్తర్వుల కోసం రైతాంగం నిరీక్షిస్తోంది. ఈ ప్రక్రియకు మోక్షం లభిస్తే రైతులకు సేవలు సకాలంలో అందడానికి వీలు కలుగుతుంది.

● రు. 15.30 కోట్లతో లావాదేవీలు

భూషణరావుపేట సొసైటీ పరిధిలో ప్రస్తుతం 12 గ్రామాలు ఉండగా చివరి గ్రామం కలికోటకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో అక్కడి రైతులు సొసైటీకి వివిధ పనుల నిమిత్తం రావాలంటే దూరభారంతో ఇబ్బందులు పడుతున్నారు. పంట, వాహనాలు, పైపులైన్లపై రుణాలు పొందడానికి తరచూ కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భూషణరావుపేట సొసైటీని కథలాపూర్, అంబారిపేట, భూషణరావుపేట సొసైటీలు విభజిస్తే గ్రామాలకు సరైన సేవలు అందడానికి ఆస్కారం ఉంటుందని కొన్నేళ్లుగా రైతాంగం అభిప్రాయపడుతోంది. కథలాపూర్ కింద దూలూరు, దుంపెట, పోసానిపేట, అంబారిపేట పరిధిలోకి ఇప్పపల్లి, పోతారం, కలికోట, భూషణరావుపేట కింద చింతకుంట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాలను విభజించాలని ప్రతిపాదన చేశారు. పాలక వర్గం ఏకగ్రీవ తీర్మానం చేసి జిల్లా సహకార అధికారికి ఈ మధ్యకాలంలో పంపించారు. ప్రస్తుతం ఈ సొసైటీ రు. 15.30 కోట్ల టర్నోవర్‌తో లావాదేవీలు కొనసాగిస్తోంది. ఇప్పటికే 9 ఎరువుల గోదాములు నిర్మించి రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. సొసైటీ లో 1912 మంది సభ్యులు ఉండగా 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. 12 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1.45 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఎప్పటి నుంచో మూడు సొసైటీల విభజన చేయాలని రైతాంగం కోరుతున్నా ఆ ప్రక్రియకు మోక్షం లభించం లేదు.



భూషణరావుపేట సింగిల్ విండో కార్యాలయం

వారం రోజుల కిందట ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి ఈ అంశం తీసుకెవెళ్లడంతో మూడు సొసైటీల ఏర్పాటు ముచ్చట తీరుతుందనే ఆశలు పెరిగాయని రైతాంగం పేర్కొంటున్నారు.

● తీర్మానం జిల్లా అధికారులకు పంపించాం

లోక బాపురెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్



ప్రస్తుతం దూరంలో ఉన్న గ్రామాల రైతులు భూషణరావుపేటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు సొసైటీలను చేస్తే రైతులకు సత్వర సేవలు అందుతాయి. పునర్విభజన చేస్తేనే రైతులను న్యాయం జరుగుతుంది. పాలక వర్గం ఏకగ్రీవ తీర్మానం చేసి జిల్లా సహకార అధికారికి పంపించడంతో పాటు ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం. తొందరగా విభజన జరుగుతుందని ఆశిస్తున్నాం.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెగడపల్లి, ఆగస్టు 4 : మండల కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ విద్యాలయంలో 2007-08లో పదవతరగతి విద్యనభ్యసించిన విద్యార్థులంతా ఆదివారం మండల కేంద్రంలో సమావేశమై తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు. ఒకరికొకరు తమ ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ పరిస్థితులు తదితర విషయాల గూర్చి ఆత్మీయంగా చర్చించుకున్నారు. అప్పటి ప్రధానోపా ధ్యాయులు జూపల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు వేణు గోపాల్‌రావు, ప్రశాంత్‌రావు, పూర్వ విద్యార్థులు మహేందర్, మహేష్, రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులంతా సమ్మేళనంగా కలుసుకున్నారు. ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని కేఆర్ ఎన్ గార్డెన్‌లో పాఠశాలలోని 2002-03 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు నాటి గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆనందంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తోటి మిత్రులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసు కున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు.



పెగడపల్లి, బండలింగాపూర్‌లో సమ్మేళనంగా ఏర్పడ్డ పూర్వ విద్యార్థులు

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ పెద్దలు

రాయికల్, ఆగస్టు 4: బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా బ్రాహ్మణ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. రాయికల్ త్రికూటాలయంలో ఆదివారం మును గోటి రమేష్ శర్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిం చారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ప్రతినిధులు రమేష్, హరిప్రసాద్, శ్రీనివాస్, రమణరావు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్

మల్యాల, ఆగస్టు 4: మండలంలో గల డీజే నిర్వహకులకు ఎస్సై నరేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం వారితో పోలీస్‌స్టేషన్‌లో సమావే శమయ్యారు. వివాహాలు ఇతరాత్ర సందర్భాల్లో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా రాత్రి సమయంలో 11లోపే డీజే నిలిపివేయాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రజల ఇబ్బందులు కూడా దృష్టిలో పెట్టుకుని మెలగాలని ఇబ్బది కలిగే విధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మున్నూరుకాపు రైతు సేవా సంఘం కార్యవర్గం

రాయికల్, ఆగస్టు 4: అల్లీపూర్ మున్నూరుకాపు రైతు సేవా సంఘం కార్యవర్గం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అత్తినేని శంకర్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా అత్తినేని మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా అత్తినేని భూమయ్య, కోశాధికారిగా రాయిల్ల రాజేందర్‌లు ఎన్నికయ్యారు. సహాయకార్యదర్శులుగా అత్తినేని రాజన్న, మంగళారపు చిన్నారెడ్డిలను ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల సేవలను గుర్తించకపోవడం విచారకరం

బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి



దీక్షలో మాట్లాడుతున్న రవిందర్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: అనేక ఏళ్లుగా జర్నలిస్టుల సేవలు పొందుతున్న నాయకులు వారి సేవలకు కనీసం గుర్తింపు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం విచారకరమని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇళ్ల స్థలాల సాధన కోసం జర్నలిస్టులు చేస్తున్న నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. జీవన్‌రెడ్డి నలభై ఏళ్ల రాజకీయాల్లో ఉండి కనీసం నాలుగు ఇళ్లు కూడా జర్నలిస్ట్‌లకు మంజూరు చేయలేదని, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సైతం కేటీఆర్, కవి తతో వాగ్దానం చేయించి మాట నిలుపుకోవడంతో విఫలం అయ్యారని ఆరోపించారు. ఎమ్మెల్సీ రమణ సైతం హడావిడి చేసి అంతలోనే మర్చిపోయారని ఎద్దేవా చేశారు. అనంతరం జర్నలిస్టుల దీక్షను నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఆయన వెంట నాయకులు లింగంపేట శ్రీనివాస్, ఏసీఎస్ రాజు, బిట్టు, సంతోష్‌కుమార్, పాదం మహేంధర్ తదితరులున్నారు.

●ఏరుదాటాక తెప్పతగలేసే విధానాన్ని నాయకులు మార్చుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధానకార్యదర్శి మోరపల్లి ప్రదీప్‌కుమార్ నేతలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్ట్‌ల సమస్యల పరిష్కారం, ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యంగా చేపట్టిన రెండో రోజు నిరసన దీక్ష విజయవంతం అయ్యింది. దీక్షకు మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, దివ్యాంగుల సంఘ బాధ్యులు లంకదాసరి శ్రీను, అజ్గర్ అలీ, సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్య క్షుడు ఎంఏ బారి, విశ్వబ్రాహ్మణ సంఘ బాధ్యులు టీవీ సత్యం, రమణ సంఘీభావం తెలిపారు.

ఉద్యోగార్థులకు సత్కారం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న నాయకులు

మల్యాల, ఆగస్టు 4: మండలంలోని ముత్యంపేటకు చెందిన నేరెళ్ల అక్షిత మండల వ్యవసాయ అధికారిగా, సింగిరెడ్డి వంశీధర్‌రెడ్డి మిషన్‌భగీరథ ఏఈ ఈగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మల్యాలకు చెందిన నల్ల జైహింద్‌రెడ్డి ఎంబీబీఎస్ పట్టా సాధించడం పట్ల మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు నేరెళ్ల భూమరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల నరసింహరెడ్డి, విండో చైర్మన్ రాంలింగారెడ్డి, మాజీ ఎంపీపీలు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, రెడ్డి సంఘ నాయకులు రాజేశ్వ ర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొమ్ముల సుదర్శన్‌రెడ్డి, సామ మహిపాల్‌రెడ్డి, లింగారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పీఠం దక్కేది ఎవరికో..?

●గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఆశావహుల యత్నాలు



గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

గొల్లపల్లి, ఆగస్టు 4 : గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ పాలక వర్గం గడువు ముగిసి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కొత్త పాలక వర్గం ఏర్పాటుకు నోచుకోలేదు. దీంతో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఈసారి ఎవరిని వరించేనో అని మండలంలో చర్చలు ఊపందుకున్నాయి. ఈ దఫా చైర్మన్ పదవిని జనరల్ అభ్యర్థులకు కేటాయించడంతో ఆ వర్గానికి చెందిన పలువురు అధికార పార్టీ నాయకులు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మొదట ఒక రిద్దరు అధికార పార్టీ నాయకులు చైర్మన్ పదవిపై ఆశలు పెంచుకుని ఆ మేరకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి తమకు చైర్మన్ పదవి ఇవ్వాలంటూ అధినేతను కోరుతూ వస్తున్నారు. కానీ ఎప్పటికప్పుడు పాలక వర్గం నియామకం వాయిదాపడుతూ వస్తోంది. దీంతో మండలంలో ఆశావాహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయినప్పటికీ విప్ కటాక్షం ఎవరిపై ఉంటుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో ధర్మపురి, వెల్గటూర్, ధర్మారం, గొల్లపల్లి, పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయాలు ఉండగా, ఇప్పటివరకు ఒక్క ధర్మారం మార్కెట్‌కు పాలక వర్గాన్ని నియమించారు. అతి త్వరలో మిగితా మార్కెట్లకు పాలకవర్గాలను నియమించే అవకాశాలు ఊపందుకున్న నేపథ్యంలో ఆయా మార్కెట్ చైర్మన్ పదవులు ఎవరిని వరించేనో అన్న చర్చలకు రెక్కలొచ్చాయి.

●చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఆశావహులు :

గొల్లపల్లి మార్కెట్ చైర్మన్ పదవిని జనరల్ అభ్యర్థులకు కేటాయించడంతో ఇక రిద్దరు అధికార పార్టీకి చెందిన నాయకులు ఈసారి చైర్మన్‌గిరిని దక్కించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మండలంలోని మల్లన్న పేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భీమ సంతోష్ చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నాట్లు తెలుస్తోంది. గతంలో రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ తరఫున జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన సానుభూతి, మరోవైపు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీని వీడకపోవడం ఈయనకు కలిసొచ్చే అంశం. దీంతో ఆయననే మార్కెట్ చైర్మన్ కుర్చీలో కూర్చునేది అని గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే, సంతోష్ బీసీ వర్గానికి చెందినవాడు అని, జనరల్ కేటగిరిలో ఆయనకు ఏలా ఇస్తారని, జనరల్ అభ్యర్థులు వాపోతున్నారు. తమకు వచ్చే అవకాశాలే తక్కువ, వచ్చిన అవకాశాల్లో బీసీలకు ఇస్తే తమ రాజకీయ భవితవ్యం ఏంటని పలువురు జనరల్ నాయకులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. అలాగే, మండలంలోని శంకరావు పేట గ్రామానికి చెందిన తాజామాజీ సర్పంచ్ నరసాని రాజ్యలక్ష్మీ భర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరసాని తిరుపతి రెడ్డి జనరల్ కేటగిరిలో తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాడు. వీరితో పాటు మండలంలోని రంగదాముని పల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం మల్లారెడ్డి చైర్మన్ పదవి కోసం తన వంతు ప్రయత్నిస్తున్నారు. మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉండడం, లక్ష్మన్ కుమార్‌కు ప్రధాన అనుచరుడిగా ఆయన గెలుపుకోసం ఏళ్ల తరబడి కృషి చేయడంతో తనకు అవకాశం ఇవ్వాలని అధినేతను కోరుతున్నారు. ఈ ముగ్గిరిలో ఎవరినో ఒక్కరిని పదవి వరిస్తుందని, ఆ ముగ్గిరిలో ఎవరన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి ఉండక తప్పదు.

సంక్షిప్తం సమాచారం

కథలాపూర్ : ప్రభుత్వం వేములవాడ ఆలయ అభివృద్ధికి రు. 50 కోట్లు కేటాయించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, తొట్ల అంజయ్య, కాయితి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కథలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు బడ్జెట్‌లో నిధులు కేటాయించి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని పేర్కొన్నారు. పులి హరిప్ర సాద్, పూండ్ర నారాయణరెడ్డి, ఉరుమల్ల చారి, అల్లకుంట లింగంగౌడ్, ఎగ్యారపు శ్రీహరి, అల్లూరి దేవన్న ఉన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంలోని గోవిం దుపల్లికి చెందిన వినుగొండ రాజశేఖర్‌రెడ్డి గుండె పోటుతో మరణించాడు. ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢసానుభూతిని తెలిపారు.

జగిత్యాలరూరల్ : జిల్లా కేంద్రంలోని జగిత్యాల రూరల్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా గొల్లపల్లి ఎమ్మార్సీ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా కోరుట్ల ఎమ్మార్సీ కె. రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా జగిత్యాల ఎమ్మార్సీ ఎన్. రఘు, కోశాధికారిగా వెల్గటూర్ ఎమ్మార్సీ శ్రీనివాస్, గౌరవఅధ్యక్షుడిగా బీర్‌పూర్ ఎమ్మార్సీ కె. నాగరాజు, కార్యదర్శులుగా మేడిపెల్లి ఎమ్మార్సీ రాజు, ధర్మపురి ఎమ్మార్సీ శోభలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీర్‌పూర్: మండలంలో క్రీడా మైదానాన్ని అధికారులు ప్రకృతి వనంగా మార్చారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ గ్రామ గ్రామాన క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో యువకుల కోసం క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి యువతకు క్రీడా కిట్లను అందించారు. వారం రోజుల క్రితం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రిడా మైదానంలో అటవీశాఖ అధికారుల టార్గెట్ కోసం మొక్కలు నాటి ప్రకృతి వనంగా మార్చారు. అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు.

బీర్‌పూర్ : బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణపు పనులను ఆదివారం ఆలయ ఈవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఆలయ స్థంబాల(పిల్లర్లు) ఏర్పాట్లలో ఏలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట క్లర్క్ రాజయ్య, జూనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్ ఉన్నారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా లావణ్య

రాయికల్, ఆగస్టు 4: పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా జిల్లా లావణ్య ఎన్నికయ్యారు. రాయికల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిద్దంశెట్టి స్వప్న, కోశాధికారిగా మాధవిలు ఎన్నికయ్యారు. పట్టణ సంఘం అధ్యక్షుడు కూరగాయల రవి కుమార్, ప్రధాన కార్యదర్శి గరిపెల్లి శ్రీనివాస్, కోశాధికారి పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మైలరాపు లింబాద్రికి ఘన సన్మానం

మెట్‌పల్లి, ఆగస్టు 4 (ఇబ్రహీంపట్నం): ఆర్యవైశ్య మహాసభ సంఘం జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పట్టణానికి చెందిన మైలరపు లింబాద్రిని ఆదివారం చైతన్య నగర్ వాడకట్టు సంఘం నెంబర్ వన్ ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. వంద మంది సభ్యులతో కలిసి లింబాద్రిని పూలమాలలు శాలువతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు పుల్లూరి నవీన్, కార్యదర్శి ఎల్ని రవికు మార్, నరేంద్రుల రవికుమార్ పాల్గొన్నారు.

చెట్టు మోడై..నిర్లక్ష్యం తోడై..



ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న వృక్షం

ఎండపల్లి, ఆగస్టు 4: ఎండపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయం ముందు మోడు బారిన భారీ వృక్షం ప్రమాదకరంగా మారింది. కరీంనగర్ రాయపట్నం రహదారిపై నిత్యం వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. మోడు బారిన చెట్టు తహసీల్దార్ కార్యాలయం ముందే ఉండడంతో అక్క డికి రెవెన్యూ పనుల మీద ప్రజలు వస్తూ పోతూ ఉంటారు. అక్కడ ఎండిన చెట్టు కిందనే ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. చెట్టు పూర్తిగా ఎండిపోయి ఉండటంతో పాటు ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఎం జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రమాదం జరగక ముందే సం బంధిత అధికారులు స్పందించి మోడు వారిన వృక్షాలను తొలిగించాలని బాటసారులు కోరుతున్నారు.